క్లుప్తంగా

కొత్తపురమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో కొత్తపురమ్మ

సంబేపల్లె : మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీ కొత్తపురమ్మ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం



వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నేతలు, విద్యార్థులు

రాయచోటి అర్బన్ : స్వామి వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శమని ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఎస్ఎం అండ్ బిఆర్ జూనియర్ కళాశాలలో గురువారం ముందస్తుగా వివేకానందుడి 161వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం వివేకానందుడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నరసింహులు, శివగంగిరెడ్డి, ప్రశాంత్, విజయ్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల సేకరణ



దరఖాస్తులు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చిట్వేలి : ప్రధానమంత్రి పశు కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం పాడి రైతుల నుంచి దరఖాస్తులు సేకరిస్తున్నట్లు డాక్టర్ భువనేశ్వరి తెలియజేశారు. మండలానికి కేటాయించిన రెండు వేల లక్ష్యాన్ని చేరుకునేందుకు గ్రామాలలో క్రెడిట్ కార్డుల దరఖాస్తుల సేకరణ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం కె.కందులవారిపల్లిలో దరఖాస్తులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సేకరించిన దరఖాస్తులను లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ మేనేజర్‌కు పంపనున్నట్లు డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి మేనేజర్లు పరిశీలించి క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఈఓ నాయక్, గోపాలమిత్రలు నరసింహులు, సుబ్బయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



జేసీబీ సాయంతో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల వెంకటాపురం గ్రామం నుంచి తల్లెంవారిపల్లి వరకు ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను గురువారం వైఎస్సార్‌సీపీ యువనాయకుడు అశోక్‌కుమార్ రెడ్డి జేసీబీ సహాయంతో తొలగించారు. రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మలుపులు వద్ద ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అశోక్ కుమార్ రెడ్డి స్పందించి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో సంక్రాంతి వేడుక



సంక్రాంతి సంబరాలు జరుపుతున్న దృశ్యం

రాజంపేట : స్థానిక ఫార్మసీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని సంక్రాంతి ముగ్గులు, రంగోలి, హ్యాండ్ మేడ్ ఆర్టిక్రాఫ్ట్స్, పొంగల్ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి ఆకట్టుకున్నారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల కళాశాల వ్యవస్థాపకులు చొప్పా గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి షురూ!



కస్టమర్స్‌తో రద్దీగా రాజంపేటలోని బట్టల షాప్



వాహనదారులతో రద్దీగా పాత పోలీస్ లైను

- ఊపందుకున్న పండుగ షాపింగ్
- కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణాలు, కిరాణా షాపులు
- జనసందోహంగా మార్కెట్లు

రాజంపేట టౌన్ : పెద్ద పండుగ సమీపిస్తుండటంతో ప్రజల్లో సంక్రాంతి జోష్ కనిపిస్తోంది. పట్టణవాసులతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలూ షాపింగ్ కోసం తరలివస్తుండటంతో జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, మండల కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రధాన రహదారులన్నీ జనంతో కిక్కిరిస్తున్నాయి. ప్రధానంగా దుస్తుల దుకాణాలు, కిరాణా షాపుల్లో జనసందోహంతో కనిపిస్తున్నాయి. హిందువులకు సంక్రాంతి పెద్ద పండుగ కావడంతో పేదలు, ధనవంతులు అన్న బేదం లేకుండా అందరూ పండుగకు కొత్త దుస్తులు ధరించి, ప్రత్యేకమైన పిండి వంటలు చేసుకొని పండుగను ఘనంగా జరుపుకుంటారు. అందువల్ల సింహభాగం వ్యాపారం దుస్తులు, వంట సరుకుల ద్వారానే సాగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మహిళలు అలంకరణకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆఫర్ల జోరే.. ఆకర్షణ మంత్రం

పండగంటేనే ఆఫర్లు.. ఆఫర్లంటునే ఆకర్షణ. ఇదే మంత్రాన్ని అనేక మంది వ్యాపారులు పాటిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు ప్రధానంగా కొన్ని రకాల దుస్తులు, మహిళలకు సంబంధించిన వస్త్రాలు, బూట్లు, చెప్పులపై డిస్కౌంట్ ఆఫర్లు ఇస్తున్నాయి. దీనికి తోడు విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో గత మూడు రోజుల నుంచి వ్యాపారాలు ఊపందుకున్నట్లు వ్యాపారులు అంటున్నారు.

ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్లు

ప్రస్తుతం దాదాపు అందరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. దీంతో చాలా మంది ఆన్‌లైన్ ద్వారా షాపింగ్ చేస్తున్నారు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో ఇచ్చే ఆఫర్లకు ప్రజలు ఆకర్షితులవుతున్నారు. తమకు కావాల్సిన వస్తువులను వెంటనే ఆన్‌లైన్‌లో చూసి ఎంతమేర ఆఫర్ ఉందో చూసుకొని బుక్ చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్స్ వస్తువులను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలు చీరలు, అలంకరణకు సంబంధించిన వస్తువులు, పురుషులు దుస్తులు, ఫుట్‌వేర్‌లను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువ కావడంతో పట్టణంలో ఎక్కడ చూసినా డెలివరీ బాయిస్ కనిపిస్తున్నారు.

ఆశాజనకంగా ఉంది

సంక్రాంతి వ్యాపారం గత వారం రోజులుగా చాలా బాగుంది. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా ప్రజలు దుస్తులు కొనుక్కునేందుకు షాపుకు వస్తున్నారు. మరో మూడు రోజులపాటు వ్యాపారం బాగుంటుంది. అందువల్ల ఈ ఏడాది ఖర్చులు పోను కాస్త మెరుగ్గానే లాభాలు వచ్చే అవకాశం ఉంది.



నాసిర్, దుస్తుల వ్యాపారి, రాజంపేట

మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగమణి

రామాపురం : మండలంలోని రాచపల్లె, హసనాపురం గ్రామాలలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గురువారం మామిడి పూత, పిందే సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉద్యానశాఖ అధికారి టి.నాగమణి తెలిపారు. మాట్లాడుతూ పూత త్వరగా, ఒకేసారి రావడానికి ఆడ పూల శాతం పెరగడానికి 13-0-45 (మల్టీకే) 10 గ్రాములు 1 లీటరు నీటికి, మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని, మామిడిలో పూమొగ్గ దశలోనే తేనె మంచు పురుగు, మసి తెగుళ్లు, పక్షి కన్ను తెగుళ్లు, బూడిద తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ ఒక లీటరు నీటికి, మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. తెల్లపూత దశలో ఆశించే తేనె మంచు పురుగు, బూడిద తెగుళ్లు, పక్షి కన్ను తెగుళ్ల నివారణకు బుప్రోఫెజిన్ 1.5 మి.లీటరు నీటికి, కంటాఫ్ 2మి.లీ లీటరు నీటికి అజాడిరెక్టిన్ మి.లీ లీటరు నీటికి పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. మామిడి పిందెలు గోలికాయ నుంచి నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు మరోమారు ఎరువులు యూరియా 1కేజీ, పొటాష్ 750 గ్రాములు చెట్లకు చొప్పున భూమిలో వేసి ఫిబ్రవరి, మార్చినెలలో నీటి తడులను 15 రోజులకు ఒకసారి ఇవ్వాలని, మామిడి గోలికాయ దశ నుంచి నిమ్మకాయ దశలో ఆశించే తోడిమకుళ్లు తెగుళ్ల నివారణకు అమిస్టార్ 1మి.లీ లీటరు నీటికి లేదా నాటిఓ 1 గ్రా లీటరు నీటికి పిచికారీ చేయాలని మామిడి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు అఫ్సర్ అలీ ఖాన్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాల తనిఖీలో విఫలం



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్

రాయచోటి అర్బన్ : కల్తీ ఆహార పదార్థాల తనిఖీల నిర్వహణలో జిల్లా అధికారులు వైఫల్యం చెందారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ అన్నారు. గురువారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో కల్తీపదార్థాల తనిఖీ అంశాన్ని పర్యవేక్షించే అధికారి ఎవరో కూడా ప్రజలకు తెలియడం లేదన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కల్తీ వంట నూనెలు, మసాల పొడుల విక్రయంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పచ్చికాయలు పండ్లు త్వరగా మాగడానికి కొన్ని మండీలలో రసాయనాలు కలుపుతున్నారంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హోటళ్లలో కూడా తనిఖీలు నిర్వహించి ధరల పట్టికలు, వినియోగదారులకు అందిస్తున్న ఆహారం నాణ్యతలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆహార పదార్థాలలో కల్తీ నివారణకు చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



డ్రైనేజీ కల్వర్టు నిర్మాణం పూర్తి చేస్తున్న దృశ్యం



సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు చదును చేసిన దృశ్యం

- గంగ జాతరకు భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చర్యలు
- మార్చి 10 నుంచి జరిగే జాతరకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయం ఎదుట రూ. 20 లక్షల పైబడి నిధులతో డ్రైనేజీ, కల్వర్టు, సిమెంట్ ప్లాట్‌ఫామ్, సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. మార్చి 10, 11, 12వ తేదీలలో జరగనున్న గంగ జాతర సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డిల చొరవతో ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, ప్రత్యేకాధికారి రవీంద్రరాజు, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకొని దగ్గర ఉండి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు పర్యవేక్షణ చేపడుతున్నారు. భక్తుల సౌకర్యార్థం కళ్యాణకట్ట నిర్మాణం కూడా దాతల సహకారంతో చేపడుతున్నామని వారు తెలిపారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు జాతరకు తరలి వస్తుండటంతో ఈ ఏడాది ముందస్తుగానే ఎమ్మెల్యే చొరవతో పనులు పూర్తి చేస్తున్నారు. భక్తుల తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో పనులు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి కృషి

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న చిన్నపాటి సమస్యలు, మౌలిక సౌకర్యాల ఏర్పాటుపై దృష్టిపెట్టి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులతో సమావేశమై గ్రామాల్లోని వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తక్షణం సమస్యలపై దృష్టిపెట్టి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం తన నుంచి పూర్తి సహాయ సహకారాలు అందుతాయన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, వీధిలైట్లు మొదలగు సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే రాబోయే సంక్రాంతి పండుగ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యంగా సర్పంచ్‌లు ముందస్తుగా ప్రజలకు అసౌకర్యం కల్పించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బోర్లు, వాటర్‌ట్యాంకులు, తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఏ సమస్యలకైనా నిధులు వెచ్చించడానికి ప్రభుత్వం, అధికారులు సిద్ధంగా ఉందన్నారు. సర్పంచ్‌లు అధికారుల దృష్టికి సమస్యలు తీసుకుని వస్తే 24 గంటలలో పరిష్కరించే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అన్ని విధాల రైల్వేకోడూరు నియోజకవర్గం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సుధాకర్‌రాజు, సర్పంచ్‌లు హరిక్రిష్ణారెడ్డి, రామక్రిష్ణ, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీరామ్ వినోద్‌లు, జనార్దన్‌రాజు, సిహెచ్.రమేష్, గునిశెట్టి రమేష్., రాజేశ్వరి, రౌఫ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగనన్న పాలన

రైల్వేకోడూరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తూ పాలన చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని, స్మృతివనాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో గురువారం రైల్వేకోడూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద కొరముట్ల పోస్టర్లను ఆవిష్కరించారు.

పరామర్శ

మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని తంబిళ్లవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రకృతి ప్రేమికుడు పంజం సుధాకర్ రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకుని గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, కొండూరు విజయ్ రెడ్డి, పంజం అమర్‌నాథరెడ్డి, కమలాకర్‌రెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, విజయరంగారెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్ సంకల్పయాత్ర



సమావేశంలో అధికారులు, నాయకులు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ సచివాలయంలో మల్లూరమ్మ దేవాలయం సమీపంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూమసాని అంజలి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్యామ్‌చంద్ర, ఎంపీడీఓ దివ్య, ఏపీఎం మాధవి, బీజేపీ నాయకులు శివప్రసాద్, మండల స్థాయి అధికారులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలోని పోలి పంచాయతీలో ఉదయం, మధ్యాహ్నం అప్పరాజుపేట గ్రామ పంచాయతీలో మండల అధికారులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పంపించిన వ్యాన్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఈఓ అండ్ పీఆర్‌డీ టి.హరిప్రసాద్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్‌నాయక్, ఏపీఎం మదన్‌మోహన్‌రెడ్డి, ఏపీఓ ఉపాధి హామీ, డాక్టర్ ఆకేపాడి పీహెచ్‌సీ వైద్యులు అశ్వని చంద్ర, పంచాయతీ సెక్రటరీ కె.శ్రీధర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు తోడ్పడతాయి



సిద్దవటం: క్రికెట్ పోటీలను నిర్వహించిన దృశ్యం



నియోజకవర్గస్థాయికి ఎంపికైన రమేష్, శివలు

సిద్దవటం : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.పులిరామ్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను సిద్దవటం గ్రామ శివారులోని ఈద్గా వద్ద నున్న మైదానంలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. అలాగే సిద్దవటంలోని గురుకుల పాఠశాల మైదానంలో వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహించామని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో మాచుపల్లి సర్పంచ్ ప్రతినిధి మల్లు భాస్కర్‌రెడ్డి, సిద్దవటం జెడ్పీ హైస్కూల్ పీడీ రెడ్డెమ్మ, గ్రామ కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, జానకి, రాజశేఖర్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలలో గెలుపు, ఓటములు సమానం

పుల్లంపేట : క్రీడలలో గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని పుల్లంపేట పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య అన్నారు. గురువారం ఆడుదాం ఆంధ్ర క్రీడలలో భాగంగా బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బ్యాడ్మింటన్‌లో రంగంపల్లి సచివాలయానికి చెందిన పి.రమేష్, మడగలం శివ కుమార్‌లు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే కొత్తపేట సచివాలయ సిబ్బంది వాలీబాల్ క్రీడలలో నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారని పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య తెలియజేశారు.

హుషారుగా ఆడుదాం ఆంధ్ర

రామాపురం : రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున క్రీడల్లో ప్రజలు హుషారుగా పాల్గొంటున్నారు. గురువారం మండలంలోని గువ్వలచెరువు, కల్పనాయినిచెరువు, గోపగుడిపల్లె, కసిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర కీడల్లో భాగంగా క్రీడాలను చూడడానికి చుట్టుపక్కల గ్రామస్తులు క్రీడా ప్రాంగణానికి వచ్చారు. ఈ క్రీడా ఉత్సవాలకు ఆయా గ్రామాల నాయకులు వెంకట్రామిరెడ్డి, శివయ్య, రఘురాం, ముంగర సుబ్బయ్య, బాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

13 నుంచి కేబీఆర్ క్రికెట్ టోర్నీ

పుల్లంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కొల్లం బ్రహ్మానందరెడ్డి జ్ఞాపకార్థం అత్యంత వైభవంగా కేబీఆర్ క్రికెట్ పోటీలను ఈనెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డిల సహకారంతో నిర్వహించే ఈ పోటీలలో పుల్లంపేట, రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, రాజంపేట మండలాలతోపాటు సమీప మండలాల క్రీడాకారులు కూడా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. జనవరి 13వ తేదీ నుంచి నెల చివరి వరకు నిర్వహించే క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు అందజేయనున్నట్లు వారు తెలియజేశారు. ఆసక్తిగల క్రీడాకారులు రూ. 1000లు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని మల్లెంవారిపల్లి గ్రామంలో నిర్వహించే ఈ క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 70950 55398, 87906 19015, 90528 73964, 79890 95478 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలియజేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రాజంపేట పార్లమెంటు పరిధిలోని రైల్వే సమస్యలు పరిష్కరించాలని గురువారం గుంతకల్ డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌కు డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు స్టేషన్‌లలో గతంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌లను ఉండేవని వాటిని పునరుద్ధరించాలని, ఓబులవారిపల్లెలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు, నందలూరు రైల్వే క్వార్టర్స్ మరమ్మతులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

19న మండల సమావేశం

సంబేపల్లె : ఈనెల 19వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. సమావేశంలో మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలి



నిరాహార దీక్షలో ఎస్‌సీఆర్ఎంయూ నాయకులు

నందలూరు(రాజంపేట) : కొత్త పెన్షన్‌ను పద్ధతిని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు రైల్వేస్టేషన్ ఎదుట ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ కె.విశ్వనాథ్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వలన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని, పదవీ విరమణ తరువాత స్వల్ప పెన్షన్ వస్తుందని, కుటుంబాలను ఎలా పోషించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు బి.సిద్దయ్య, సి.వినోద్ కుమార్, ఎస్.మహబూబ్ బాషా, వైస్ చైర్మన్‌లు ఎస్.నరసింహులు, బి.వి.శివకుమార్ రాజు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీఎంను కలసిన గాలివీటి సోదరులు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మదన్‌రెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వీరబల్లె మండల కేంద్రంలోని గాలివీటి సోదరులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం వీరు రాబోవు సార్వత్రిక ఎన్నికలు, వీరబల్లె అభివృద్ధిపై చర్చించినట్లు మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కరెడ్డి, వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, రాజంపేట నియోజకవర్గ నాయకులు గాలివీటి విజయసాగర్ రెడ్డి (మదన్‌రెడ్డి)లు తెలిపారు.

శ్మశాన వాటిక దారి సమస్య పరిష్కారం

గుర్రంకొండ : ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో గుర్రంకొండలో హిందూ శ్మశాన వాటికకు 14 ఏళ్లుగా నెలకొన్న దారి సమస్య పరిష్కారమైంది. ఇటీవల ఎమ్మెల్యే స్థానిక ఇందిరమ్మ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు శ్మశాన వాటిక దారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు గురువారం కడప-బెంగుళూరు జాతీయ రహదారి నుంచి కాలనీ లోపల ఉన్న శ్మశానం వరకు జేసీబీలతో దారిని ఏర్పాటు చేశారు. అదే విధంగా కాలనీ లోపల నుంచి వెళ్లే దారిని కూడా బాగు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సమీన్ ముక్తియార్, ఎంపీపీ యోగేంద్ర, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్ అక్కడికి చేరుకొని పనులను పర్యవేక్షించారు. శ్మశాన వాటికకు అవసరమైన సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని మండల పరిషత్ నిధుల ద్వారా చేపడతామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెడ్డెమ్మకొండ పాలకమండలి సభ్యులు నక్కామధు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గణేష్, రమేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

మహాశివునికి అన్నాభిషేకం



మహాశివునికి పూజ చేస్తున్న దృశ్యం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా లింగోద్భవ మహాశివునికి అన్నాభిషేకం నిర్వహించారు. షిర్డీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా మహాశివునికి జలాభిషేకం, పాలాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూది అభిషేకాలు చేశారు. అనంతరం మంత్రోచ్చారణల నడుమ మహా శివునికి అన్నాభిషేకం నిర్వహించారు. అలాగే ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి, శనేశ్వరస్వామి, సిద్ధి వినాయక స్వామి, సాయిబాబా, ఆంజనేయ స్వామిలను ప్రత్యేకంగా అలంకరించి దర్శన భాగ్యం కల్పించారు.